APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ శనివారం 11, జూలై 2026 సంపుటి: 01 సంచిక :45 పేజీలు : 04 వెల: 2-00/-



## సరిహద్దు భద్రతపై సమీక్ష

- జిల్లా పోలీసులతో సమావేశం
- ఆధునిక భద్రతపై దృష్టి
- సాంకేతికతకు ప్రాధాన్యం

న్యూఢిల్లీ, జూలై 10 : కేంద్ర హోంమంత్రి అమిత్ షా న్యూఢిల్లీలో భూ సరిహద్దు జిల్లాల పోలీసు సూపరింటెండెంట్ల సదస్సుకు అధ్యక్షత వహించారు. దేశ సరిహద్దుల భద్రతను మరింత పటిష్ఠం చేయడం, జిల్లా స్థాయిలో భద్రతా వ్యవస్థను బలోపేతం చేయడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగంపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం దేశ సరిహద్దు భద్రతను స్పందనాత్మక వ్యవస్థ నుంచి ముందస్తు చర్యలు తీసుకునే సమర్థ వ్యవస్థగా మార్చిందని అమిత్ షా తెలిపారు. భద్రతా బలగాలు, పరిపాలనా యంత్రాంగం, సాంకేతిక పరిజ్ఞానం, ప్రజల భాగస్వామ్యాన్ని సమన్వయం చేస్తూ సమగ్ర భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. స్మార్ట్ సరిహద్దుల భావనతో జిల్లా స్థాయి వరకు నాలుగు అంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని హోంమంత్రి వెల్లడించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రతి అంగుళం సరిహద్దును పర్యవేక్షించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సరిహద్దు ప్రాంతాల్లో భద్రతతో పాటు అక్రమ చొరబాట్లు, స్మగ్లింగ్, ఇతర నేరాలను అరికట్టేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం మరింత అప్రమత్తంగా పనిచేయాలని అమిత్ షా సూచించారు. కేంద్ర, రాష్ట్ర భద్రతా సంస్థల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. సరిహద్దు జిల్లాల్లో ఆధునిక పరికరాలు, నిఘా వ్యవస్థలు, సాంకేతిక మౌలిక సదుపాయాల వినియోగాన్ని పెంచి ప్రపంచ స్థాయి భద్రతా వలయాన్ని ఏర్పాటు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని హోంమంత్రి స్పష్టం చేశారు.

## 30 కీలక నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం



- మంత్రివర్గంలో కీలక నిర్ణయాలు
- అభివృద్ధి ప్రాజెక్టులకు గ్రీన్‌సిగ్నల్
- సంక్షేమంపై ప్రత్యేక దృష్టి
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

అమరావతి, జూలై 10: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన శుక్రవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో 30కి పైగా కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. ప్రజా సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి, పెట్టుబడుల ప్రోత్సాహం, పారిశ్రామిక విస్తరణకు సంబంధించిన పలు ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో తాగునీటి సౌకర్యాల మెరుగుదలకు రూ.11 వేల కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. ప్రజలకు సురక్షిత తాగునీరు అందించడంతో పాటు మౌలిక సదుపాయాలను బలోపేతం చేసే దిశగా ఈ ప్రాజెక్టులను అమలు చేయనున్నారు. పారిశ్రామికాభివృద్ధికి ఊతమిచ్చే భారీ పెట్టుబడులు, లాజిస్టిక్స్ పార్కుల ఏర్పాటుతో పాటు అమరావతి అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలకు మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు ఆకర్షించి ఉపాధి అవకాశాలు పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించింది. పర్యాటక రంగ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ హోటళ్లు, వినోద ఉద్యానవనాల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు కల్పించాలని నిర్ణయించింది. విద్యార్థుల కోసం ఐఐటీ-జేఈఈ, నీట్ ప్రవేశ పరీక్షలకు నివాస శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కూడా ఆమోదం తెలిపింది. విశాఖపట్నంలో జాతీయ దర్యాప్తు సంస్థ ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటు చేయడంతో పాటు అమరావతి రైతులకు రుణమాఫీ, వార్షిక కౌలు పెంపునకు సంబంధించిన నిర్ణయాలను కూడా మంత్రివర్గం ఆమోదించింది. దీంతో రైతులకు ఆర్థిక భరోసా మరింత బలోపేతం కానుంది. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, పెట్టుబడుల ప్రోత్సాహం, విద్య, వ్యవసాయం, మౌలిక సదుపాయాల రంగాలకు ఊతమిచ్చేలా మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలు అమలులోకి రానున్నాయి. ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా ముందుకు తీసుకెళ్లే దిశగా చర్యలు కొనసాగిస్తోందని అధికార వర్గాలు తెలిపాయి.



## ఆనంకు జన్మదిన శుభాకాంక్షలు

- నారాయణ శుభాకాంక్షల సందేశం
- ప్రజాసేవను కొనియాడిన మంత్రి
- ఆయురారోగ్యాలు కోరుతూ ఆకాంక్ష

అమరావతి, జూలై 10 : దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి జన్మదినం సందర్భంగా రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ శుభాకాంక్షలు తెలిపారు. తన చిరకాల మిత్రుడైన అనం రామనారాయణరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రత్యేక సందేశం విడుదల చేశారు. ప్రజాసేవలో అనం రామనారాయణరెడ్డి చూపుతున్న నిబద్ధత, దశాబ్దాల రాజకీయ అనుభవం, ప్రజల పట్ల అంకితభావం ఆయనకు రాష్ట్రవ్యాప్తంగా విశేష గౌరవాన్ని తీసుకువచ్చాయని నారాయణ పేర్కొన్నారు.

## కనకదుర్గమ్మకు మంత్రి ప్రత్యేక పూజలు



- స్మార్ట్ హెల్త్‌కేర్ ఫుట్‌వేర్ కర్మాగారం సందర్శన
- ఆధునిక సాంకేతికతతో తయారీ విధానాల పరిశీలన
- దక్షిణ కొరియాలో లోకేశ్ పర్యటన

బుసాన్, జులై 9 : ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియా పర్యటనలో భాగంగా బుసాన్‌లోని ప్రముఖ మెడికల్ డివైస్ సర్టిఫైడ్ స్మార్ట్ హెల్త్‌కేర్ ఫుట్‌వేర్ తయారీ సంస్థ 'షూఆల్స్' కర్మాగారాన్ని సందర్శించారు. సంస్థలో ఉపయోగిస్తున్న ఆధునిక తయారీ సాంకేతికతను పరిశీలించి, ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రక్త ప్రసరణను మెరుగుపరచడం, కండరాల అలసటను తగ్గించే మెడికల్ మాగ్నెటిక్ జనరేటర్లు, ప్రత్యేక చిప్‌లతో రూపొందిస్తున్న పాదరక్షల తయారీ ప్రక్రియను లోకేశ్ పరిశీలించారు. ఆరోగ్య సంరక్షణకు తోడ్పడే వినూత్న సాంకేతిక పరిజ్ఞానంపై సంస్థ ప్రతినిధులు వివరించారు. నడకలో అసౌకర్యాన్ని తగ్గించి పాదాల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ప్రత్యేక వైబ్రేషన్ చిప్‌లతో కూడిన పాదరక్షల తయారీ విధానాన్ని కూడా మంత్రి పరిశీలించారు. వైద్య సాంకేతికత, పాదరక్షల తయారీ రంగంలో జరుగుతున్న సాంకేతిక అభివృద్ధిపై ఆసక్తి వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో వైద్య పరికరాలు, ఆరోగ్య సాంకేతికత ఆధారిత పరిశ్రమలకు విస్తృత అవకాశాలు ఉన్నాయని లోకేశ్ తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేయాలని సంస్థ ప్రతినిధులను ఆహ్వానించారు. ప్రపంచ స్థాయి తయారీ కేంద్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అనుకూల పారిశ్రామిక వాతావరణాన్ని కల్పిస్తోందని వివరించారు.

కొత్త సాంకేతికతలను రాష్ట్రానికి తీసుకురావడం, అధునాతన తయారీ పరిశ్రమలను ఆకర్షించడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. విదేశీ పెట్టుబడులతో రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని అన్నారు. దక్షిణ కొరియా పర్యటనలో భాగంగా ప్రముఖ అంతర్జాతీయ సంస్థలతో సమావేశాలు నిర్వహిస్తున్న లోకేశ్, ఎలక్ట్రానిక్స్, వైద్య పరికరాలు, విద్యుత్ వాహనాలు, ఆధునిక తయారీ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించే దిశగా చర్చలు కొనసాగిస్తున్నారు. రాష్ట్రాన్ని వేగవంతమైన పారిశ్రామిక గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.



## గోల్డ్ లోన్ మోసం ఛేదన

- వెలుగులోకి రూ.10 కోట్ల కేసు
- ప్రధాన నిందితుడి అరెస్టు
- రూ.5.81 కోట్ల సొత్తు స్వాధీనం

ఏలూరు, జూలై 10 : జంగారెడ్డిగూడెంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖలో జరిగిన సుమారు రూ.10 కోట్ల విలువైన గోల్డ్ లోన్ మోసం కేసును ఏలూరు జిల్లా పోలీసులు ఛేదించారు. 6.449 కిలోల బంగారం అదృశ్యమైన ఈ కేసులో ప్రధాన నిందితుడిని అరెస్టు చేసి భారీ మొత్తంలో ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో భాగంగా నిందితుడి వద్ద నుంచి రూ.5.81 కోట్ల విలువైన బంగారం, ఇతర ఆస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. మోసానికి సంబంధించిన కీలక ఆధారాలను సేకరించినట్లు తెలిపారు. గోల్డ్ లోన్ పేరుతో బ్యాంకును మోసం చేసి భారీ మొత్తంలో బంగారాన్ని అక్రమంగా తరలించినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని పోలీసులు పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో మరికొందరి ప్రమేయం ఉందా అనే కోణంలోనూ దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసును ఛేదించేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి సాంకేతిక ఆధారాలతో విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. సేకరించిన సమాచారం ఆధారంగా ప్రధాన నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న బంగారం, ఇతర సొత్తును చట్టపరమైన ప్రక్రియలో భాగంగా న్యాయస్థానం ముందు సమర్పించనున్నట్లు పోలీసులు తెలిపారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించే పనిలో దర్యాప్తు బృందం నిమగ్నమై ఉంది. ఈ మోసంలో పాల్గొన్న ఇతర వ్యక్తుల పాత్రపై కూడా విచారణ కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు. బ్యాంకింగ్ రంగంలో ఇలాంటి నేరాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# శ్రీ సత్యసాయి జిల్లా బీజేపీ దళిత మోర్చా ఉపాధ్యక్షుడిగా మేకలపల్లి గంగయ్య నియామకం



ధర్మవరం జూలై 10 అనంత సూర్య : భారతీ-య జనతా పార్టీ (బీజేపీ) శ్రీ సత్యసాయి జిల్లా దళిత మోర్చా ఉపాధ్యక్షుడిగా మేకలపల్లి గంగయ్యను పార్టీ నాయకత్వం నియమించింది. ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి ఈ కీలక బాధ్యతను అప్పగించిన పార్టీ నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా బీజేపీ శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు జి.ఎం. శేఖర్ స్వామి, ధర్మవరం అసెంబ్లీ కన్వీనర్ గోపాల్ రెడ్డి, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గోపినాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు సాకే ఓబులేసు, అమర దేవేందర్, ఎన్‌డీఏ కార్యాలయం ధర్మవరం ఇన్‌చార్జ్ హరీష్ బాబు, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు ఎస్.పి. పోతలయ్య, ధర్మవరం మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కొంకా నాగార్జునతో పాటు ధర్మవరం అసెంబ్లీ సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, మిత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని గంగయ్య పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా ఉన్న దళితవాడల్లో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించడంతో పాటు పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి పనిచేస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ నియామకంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు గంగయ్యకు అభినందనలు తెలియజేస్తూ, ఆయన విజయవంతంగా బాధ్యతలు నిర్వహించాలని

# ధర్మవరం మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా అడ్వకేట్ బిల్లే రవి



ధర్మవరం, జూలై 10 అనంత సూర్య: ధర్మవరం మున్సిపాలిటీ మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా అడ్వకేట్ బిల్లే రవి నియమితులైన సందర్భంగా శుక్రవారం ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే ఏబీవీపీ ద్వారా ప్రజా జీవితాన్ని ప్రారంభించిన బిల్లే రవి, అనంతరం బీజేపీ యువ మోర్చాలో పట్టణం నుంచి రాష్ట్ర స్థాయి వరకు పలు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేశారని అన్నారు. న్యాయవాదిగా కూడా విశేష అనుభవం కలిగిన ఆయన ధర్మవరం బార్ అసోసియేషన్ ట్రెజ-రర్‌గా రెండుసార్లు సేవలందించారని తెలిపారు. ప్రజా సేవ, పార్టీ పట్ల నిబద్ధత, న్యాయపరమైన అనుభవాన్ని గుర్తించి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ ప్రోత్సాహంతో బిల్లే రవికి ఈ బాధ్యతలు దక్కాయని హరీష్ బాబు పేర్కొన్నారు. మున్సిపాలిటీకి సంబంధించిన న్యాయ వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహించి పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేస్తారనే విశ్వాసం వ్యక్తం చేశారు. బిల్లే రవి మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన మంత్రి సత్యకుమార్ యాదవ్, పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపాలిటీ ప్రయోజనాల పరిరక్షణకు పూర్తి నిబద్ధతతో పనిచేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబులేసు, కొంక నాగార్జున, చిన్న లింగమయ్య, నారా కొండయ్య చౌదరి, భక్తవత్సలం నాయుడు, వడ్డే శీనతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని బిల్లే రవికి శుభాకాంక్షలు తెలిపారు.

# అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలి: సీఐటీయూ



పుట్టపర్తి, జూలై 10 అనంత సూర్య: అంగన్‌వాడీ ఉద్యోగులకు వేతనాలు పెంచాలని, పని భారాన్ని తగ్గించాలని, నవచేతన యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో శుక్రవారం పుట్టపర్తిలో భారీ నిరసన చేపట్టారు. అంగన్‌వాడీ కోర్కెల దినం సందర్భంగా గణేష్ సర్కిల్ నుంచి కలెక్టర్ కార్యాలయానికి ర్యాలీగా బయలుదేరిన అంగన్‌వాడీలను పోలీసులు అడ్డుకోవడంతో వారు బారికేడ్లు దాటి ముందుకు సాగారు. అనంతరం ఆర్టీసీ డిపో సమీపంలో రోడ్డుపై బైఠాయించి స-ుమారు రెండు గంటల పాటు నినాదాలతో నిరసన తెలిపారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి. ఓబులు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, నవచేతన యాప్‌ను రద్దు చేసి పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఐసీడీఎస్‌కు తగిన నిధులు కేటాయించి వ్యవస్థను బలోపేతం చేయాలని, పెండింగ్ బిల్లులు చెల్లించి మినీ సెంటర్లను అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా నాయకులు జడ్పీ శ్రీనివాసులు, జి.ఎల్. నరసింహులు మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు అంగన్‌వాడీల వేతనాలను వెంటనే పెంచాలని, సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. సమస్యల పరిష్కారానికి త్వరలో యూనియన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తామని జాయింట్ కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకులు, పెద్ద సంఖ్యలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పుట్టపర్తిలో రూపుదిద్దుకోనున్న అత్యాధునిక రైతు బజార్: వైభవంగా భూమి పూజ





పుట్టపర్తి/కొత్తచెరువు, జూలై 10, అనంత సూర్య; పుట్టపర్తి పట్టణ ప్రజల, రైతుల చిరకాల స్వప్నం నె-రవేరబోతోంది. పట్టణంలో నూతనంగా నిర్మించనున్న అత్యాధునిక రైతు బజార్ స్థలంలో శుక్రవారం శాస్త్రోక్తంగా భూమి పూజ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. పుట్టపర్తి శా-సనసభ్యురాలు పల్లె సింధురా రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్, జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ , మార్కెట్ కమిటీ చైర్మన్ పూల శివ ప్రసాద్ తదితరులు సంయుక్తంగా పాల్గొని ఈ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మరియు మాజీ మంత్రి శ్రీ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవతో, పుట్టపర్తి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధిలో భాగంగానే ఈ అత్యాధునిక రైతు బజారును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలకు నాణ్యమైన, తాజా కూరగాయలను అందుబాటులోకి తీసుకు రావడంతో పాటు... రైతులు తాము పండించిన పంటను దళారుల ప్రమేయం లేకుండా, నేరుగా వినియోగదారులకే అమ్ముకుని మద్దతు ధర పొందేందుకు ఈ రైతు బజార్ ఎంతగానో దోహదపడుతుంది అని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్ జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ మాట్లాడుతూ... ఈ రైతు బజార్ నిర్మాణానికి సంబంధించి స్థలాన్ని ఇప్పటికే కేటాయించామని తెలిపారు. ఎటువంటి ఆటంకాలు లేకుండా, అన్ని రకాల అత్యాధునిక వసతులతో అత్యంత త్వరగా నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ పూల శివప్రసాద్ మాట్లాడుతూ... పుట్టపర్తిలో కూరగాయల సంతను నిర్వహించడానికి సరైన స్థలం లేక ఇన్నాళ్లూ వ్యాపారులు, ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. ఈ నూతన రైతు బజారు ఏర్పాటుతో ఆ సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి (ఏ.డి.) సయ్యద్ హాఫీజుల్లా మాట్లాడుతూ... పుట్టపర్తి పట్టణవాసులందరికీ ఒకే చోట, సరసమైన ధరలకే నాణ్యమైన కూరగాయలు లభించేలా, అన్ని హంగులతో ఈ రైతు బజారును డిజైన్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, మార్కెటింగ్ శాఖ సిబ్బంది, రైతు సంఘాల నాయకులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. నూతన రైతు బజార్ ఏర్పాటు కానుండటం పట్ల పుట్టపర్తి ప్రజలు, రైతు లోకం హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

# ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను పరిశీలించిన తహశీల్దార్ మనోజ్ కుమార్ రెడ్డి



నల్లమాడ, జూలై 10 అనంత సూర్య: నల్లమాడ మండలం వంకరకుంట గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు నమోదు (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని తహశీల్దార్ మనోజ్ కుమార్ రెడ్డి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా 133, 134, 135 పోలింగ్ బూత్‌లను సందర్శించిన ఆయన, బీఎల్‌వోలు నిర్వహిస్తున్న ఓటర్ల నమోదు ప్రక్రియను పరిశీలించి, ఆన్‌లైన్ నమోదు విధానంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఓటరు వివరాలు ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు అయ్యేలా పూర్తి పారదర్శకతతో పనిచేయాలని అధికారులకు సూచించారు. దరఖాస్తుల పరిశీలనలో నిర్లక్ష్యం లేకుండా వ్యవహరించాలని, అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని బీఎల్‌వోలకు దిశానిర్దేశం చేశారు. ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతంగా, ఖచ్చితంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ శంకర, నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ కోఆర్డినేటర్ మంజు రెడ్డి, యూనిట్ ఇన్‌చార్జ్ చంద్ర రెడ్డి, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ మణికుమారి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడిన టీడీపీ కార్యకర్త బయారెడ్డిని పరామర్శించిన డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు



నల్లమాడ, జూలై 10 అనంత సూర్య: శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గం నల్లమాడ మండలం మస్కవంకపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త కొండ్రెడ్డి బయారెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి అనంతపురంలో శస్త్రచికిత్స చేయించుకుని ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు శుక్రవారం బయారెడ్డి నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్. కేశవరెడ్డి, వార్డు సభ్యుడు శ్రీనాథ్, ఫీల్డ్ అసిస్టెంట్ వలం ఈశ్వరయ్య, రామకృష్ణ, బాలరాజు, చంద్రశేఖర్, ఇషాక్ తదితరులు పాల్గొన్నారు.

# 195 మంది లబ్ధిదారులకు రూ.66.21 లక్షల సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



మడకశిర, జూలై 10 అనంత సూర్య: పేద ప్రజలకు అత్యవసర వైద్య చికిత్స అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో అండగా నిలుస్తోందని శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యుడు, మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజు పేర్కొన్నారు. శుక్రవారం మడకశిర ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మడకశిర నియోజకవర్గ అబ్జర్వర్ యనమల సుధాకర్‌తో కలిసి నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 195 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.66.21 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు పొందేందుకు సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగపడుతోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో సంక్షేమ పథకాలను ప్రజలకు సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐదు మండలాల టీడీపీ మండల కన్వీనర్లు, సింగిల్ విండో అధ్యక్షులు, మాజీ సర్పంచులు, మాజీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తచెరువు నాగులకణం స్మశానవాటిక వద్ద సీసీ రోడ్డు నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతి



పుట్టపర్తి, జూలై 10 : పుట్టపర్తిలో నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డికి కొత్తచెరువు గ్రామ ప్రజలు వినతిపత్రం అందజేశారు. కొత్తచెరువు నాగులకణం సమీపంలోని స్మశానవాటికలో ఖననాలు జరుగుతుండటంతో చెరువులోకి వెళ్లే దారి క్రమంగా ఆక్రమణకు గురై ఇరుకుగా మారుతోందని వినతిలో పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం వినాయక చవితి సందర్భంగా గ్రామ ప్రజలు ఇదే మార్గం ద్వారా వినాయక విగ్రహాల నిమజ్జనం నిర్వహిస్తున్నందున ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వివరించారు. అందువల్ల ప్రజల సౌకర్యార్థం ప్రస్తుతం ఉన్న దారికి సీసీ రోడ్డు నిర్మించి, మార్గం ఆక్రమణకు గురికాకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే, మాజీ మంత్రిని కోరారు. సమస్యను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు..

## వదాన్య ఫౌండేషన్ టాలెంట్ టెస్ట్ టాపర్లను అభినందించిన జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



పుట్టపర్తి, జూలై 10 అనంత సూర్య: వదాన్య ఫౌండేషన్ టాలెంట్ టెస్ట్ ద్వారా ఎంపికై దేశంలోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ప్రవేశాలు సాధించిన ముగ్గురు విద్యార్థులను శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అభినందించారు. ఈ సందర్భంగా టాలెంట్ టెస్ట్--2026 కోసం రూపొందించిన 500 ప్రశ్నల ప్రశ్నల పుస్తకాన్ని ఆవిష్కరించారు. వదాన్య ఫౌండేషన్ మార్గదర్శకత్వంతో జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో విజయం సాధించిన జుగేష్ కుమార్ ఐఐటీ మద్రాస్, తులసి కార్తీక్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ), బెంగళూరు, యశ్వంత్ కుమార్ రెడ్డి ఐఐటీ రూర్కీలో ప్రవేశాలు పొందారు. ఈ ముగ్గురు పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు పట్టుదలతో ఉన్నత లక్ష్యాలు సాధించడం ఆదర్శనీయమని కొనియాడారు. వదాన్య ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అశోక్ పడపాటి మాట్లాడుతూ, గత 15 సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు విద్యా సహాయం, మార్గదర్శకత్వం అందిస్తున్నామని తెలిపారు. గత ఐదేళ్లలో శ్రీ సత్యసాయి జిల్లాలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో 200కు పైగా ప్రభుత్వ పాఠశాలల నుంచి సుమారు 15 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. ఈ ఏడాది నవంబర్ చివరి వారంలో శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాల్లో నిర్వహించే వదాన్య ఫౌండేషన్ టాలెంట్ టెస్ట్--2026లో 500కు పైగా ప్రభుత్వ పాఠశాలల నుంచి 12 వేల మందికి పైగా విద్యార్థులు పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు. గ్రామీణ ప్రతిభను గుర్తించి ఐఐటీలు, ఎన్ఐటీలు, ఐఐఎస్‌సీ, వైద్య విద్య, సివిల్ సర్వీసులు వంటి ఉన్నత లక్ష్యాల వైపు విద్యార్థులను ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు.

## పంటల బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



పుట్టపర్తి, జూలై 10 అనంత సూర్య: ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయే రైతులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) అమలు చేస్తోందని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. అర్హులైన రైతులు గడువులోగా ప్రీమియం చెల్లించి ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వాతావరణ ఆధారిత బీమా పథకం కింద ఏప్రిల్ 1 నుంచి జూలై 15 వరకు పంట రుణాలు పొందిన వేరుశనగ, పత్తి, దానిమ్మ, బత్తాయి, టమాటా రైతులు అర్హులని తెలిపారు. ఎకరానికి వేరుశనగకు ₹640, పత్తికి ₹1,140, దానిమ్మకు ₹3,750, బత్తాయికి ₹2,750, టమాటాకు ₹1,600 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని, చివరి తేదీ జూలై 15 అని పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద వరి, కంది, జొన్న, మొక్కజొన్న, ఆముదం పంటలకు బీమా సౌకర్యం అందుబాటులో ఉందన్నారు. ఎకరానికి కంది, ఆముదానికి ₹80, వరికి ₹164, జొన్నకు ₹84, మొక్కజొన్నకు ₹132 ప్రీమియం నిర్ణయించినట్లు తెలిపారు. వరి పంటకు ఆగస్టు 15లోపు, మిగిలిన పంటలకు జూలై 31లోపు ప్రీమియం చెల్లించాలని సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పంటలకు బీమా రక్షణ కల్పించుకోవాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# నల్లమాడ కస్తూర్బా విద్యాలయంలో బియ్యం అక్రమాల ఆరోపణలు

### వైరల్ ఆడియోపై విచారణకు డిమాండ్

నల్లమాడ, జూలై 10 : శ్రీ సత్యసాయి జిల్లా నల్లమాడ కస్తూర్బా బాలికల విద్యాలయంలో విద్యార్థినుల కోసం ప్రభుత్వం సరఫరా చేసిన బియ్యం అక్రమంగా విక్రయించారనే ఆరోపణలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. ఈ వ్యవహారానికి సంబంధించినట్లు చెబుతున్న ఓ ఆడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని స్థానికులు, విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న ఆడియోలో బియ్యం విక్రయాలకు సంబంధించి ఇద్దరి మధ్య సంభాషణ వినిపిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఆ ఆడియో ప్రామాణికతపై ఇప్పటివరకు అధికారిక నిర్ధారణ వెలువడలేదు. ఈ వ్యవహారంలో పాఠశాల అకౌంటెంట్‌కు శోకాజ్ నోటీసు జారీ చేసినట్లు సమాచారం. అయితే ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే పాఠశాలలోని కొన్ని ఆర్థిక లావాదేవీలు, బియ్యం విక్రయాల అంశాలపై కూడా సమగ్ర విచారణ జరపాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. విద్యార్థినుల సంక్షేమానికి సంబంధించిన ప్రభుత్వ ఆహార ధాన్యాల వినియోగంపై ఎలాంటి అక్రమాలు జరిగాయన్న విషయాన్ని జిల్లా యంత్రాంగం స్వతంత్రంగా, నిష్పాక్షికంగా విచారించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని స్థానికులు కోరుతున్నారు.

# భాష్యం విద్యాసంస్థల్లో విద్యార్థులకు ఎన్నికలు



అనంతపురం, జూలై 10 అనంత సూర్య : అనంతపురం నగరం హౌసింగ్ బోర్డ్ కాలనీ నందు గల భాష్యం పాఠశాలలో విద్యార్థి ఎన్నికలు ఘనంగా జరిగాయి. ఈ ఎన్నికలు సార్వత్రిక ఎన్నికల తరహాలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బాలకృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుండి నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని, సమాజానికి సేవ చేయాలని ఆయన మాట్లాడుతూ భారత దేశంలో ఓటు హక్కుకు ఉన్న ప్రాముఖ్యతను, మ్యానిఫెస్టో అంటే ఏమిటి రాజకీయాల్లో యువత యొక్క ప్రాముఖ్యత, రాజకీయాల్లోకి యువత రావాల్సిన అవసరం ఉందని కొనియాడారు. చిన్నతనం నుంచే నాయకత్వ లక్షణాలను అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు సమాజం పట్ల దేశం పట్ల సేవా భావాన్ని కలిగి ఉండాలని దేశ భవిష్యత్తు యువత పైన ఆధారపడి ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా జేడీఓ రవివర్మ మాట్లాడుతూ.. భాష్యం విద్యాసంస్థలో పిల్లలకు అన్ని రంగాలలో ప్రావీణ్యం పొందడానికి తర్ఫీదు ఇస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా జేడీఓ రవివర్మ ప్రిన్సిపల్ బాలకృష్ణ, హెచ్ఎం, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

# పీవీకేకేలో ఓరియంటేషన్ కు విశేష స్పందన

అనంతపురం, జూలై 10 అనంత సూర్య : స్థానిక రుద్రంపేటలోని పీవీకేకే ఐటి డిప్లొమా కళాశాలలో నూతనంగా ప్రవేశం పొందిన డిప్లొమా విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కోసం నిర్వహించిన ఓరియంటేషన్--2026 కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. సుమారు 800 మంది విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని కళాశాల విద్యా విధానం, కోర్సుల ప్రత్యేకతలు, ఉపాధి అవకాశాలు, శిక్షణా విధానంపై సమగ్ర అవగాహన పొందారు. ఈ సందర్భంగా బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డా. పల్లె వెంకట కృష్ణ కిషోర్ మాట్లాడుతూ.. నేటి సాంకేతిక ప్రపంచంలో డిప్లొమా విద్యార్థులకు అపారమైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. సాంకేతిక నైపుణ్యాలతో పాటు క్రమశిక్షణ, కమ్యూనికేషన్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకుంటే ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలతో పాటు ప్రముఖ పరిశ్రమలు, సాఫ్ట్‌వేర్ సంస్థల్లోనూ ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని పేర్కొన్నారు. పీవీకేకే ఐటి డిప్లొమా కళాశాల




జిల్లాలో నాణ్యమైన సాంకేతిక విద్యను అందిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తోందని అన్నారు.

పీవీకేకే ఐటి డిప్లొమా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.ఎన్.ఎస్. వైభవ్ మాట్లాడుతూ, డిప్లొమా కోర్సుల ప్రత్యేకత, ఉన్నత విద్యకు అందుబాటులో ఉన్న అవకాశాలు, క్యాంపస్ ప్లేస్‌మెంట్లు, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా అందిస్తున్న శిక్షణ, అత్యాధునిక ల్యాబ్ సౌకర్యాల గురించి విద్యార్థులు, తల్లిదండ్రులకు వివరించారు. ఈ విద్యా సంవత్సరంలో 420 సీట్లకు 420 సీట్లు పూర్తిగా భర్తీ కావడం కళాశాలపై విద్యార్థులు,



తల్లిదండ్రులు ఉంచిన విశ్వాసానికి నిదర్శనమని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు అడిగిన ప్రశ్నలకు అధ్యాపకులు సమగ్రంగా సమాధానాలు అందించి వారి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. కార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధి కె. శ్రీకాంత్ రెడ్డి, పీవీకేకే ఐటి కళాశాల ప్రిన్సిపాల్ డా. బండి రమేష్ బాబు, డిప్లొమా విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ మత్స్య రైతుల దినోత్సవం



పుట్టపర్తి, జూలై 10 : శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రంలో శుక్రవారం జాతీయ మత్స్య రైతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్యశాఖ అధికారి ఎన్. చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, 1957లో శాస్త్రవేత్తలు డాక్టర్ హీరాలాల్ చౌదరి, అలికున్హి చేపట్టిన ప్రేరిత చేపల పెంపక పరిశోధనల జ్ఞాపకార్థం ప్రతి ఏడాది ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆవిష్కరణ దేశంలో నీలి విప్లవానికి, మత్స్య రంగ అభివృద్ధికి పునాది వేసిందన్నారు. మత్స్యకారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, జాతీయ మత్స్య అభివృద్ధి మండలి (ఎన్ఎఫ్‌డీబీ) ద్వారా అమలవుతున్న పథకాలు, సబ్సిడీలపై అవగాహన కల్పించారు. మత్స్య సహకార సంఘాలు రికార్డులను సక్రమంగా నిర్వహించి, క్రమం తప్పకుండా ఆడిట్ చేయించుకోవాలని సూచించారు. అలాగే చెరువుల్లో నాణ్యమైన చేప పిల్లలను తగిన సంఖ్యలో వదిలి అధిక దిగుబడులు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు నగేష్, వివిధ మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు, సభ్యులు, మత్స్యశాఖ సిబ్బంది, గ్రామ మత్స్య సహాయకులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

# పుట్టపర్తి చిత్రావతి తీరంలో అత్యాధునిక ఫుడ్ కోర్టు ప్రారంభం







పుట్టపర్తి, జూలై 10 అనంత సూర్య: పుట్టపర్తి చిత్రావతి నది తీరంలో నూతనంగా నిర్మించిన అత్యాధునిక ఫుడ్ కోర్టును జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి శుక్రవారం సంయుక్తంగా ప్రారంభించారు .వేదమంత్రాల నడుమ రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలన అనంతరం ఫుడ్ కోర్టును ప్రారంభించిన వారు అక్కడ ఏర్పాటు చేసిన ఆహార స్టాళ్లను సందర్శించి సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ, పుట్టపర్తి ప్రపంచ ప్రఖ్యాత ఆధ్యాత్మిక కేంద్రం కావడంతో దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులు, పర్యాటకులు, స్థానిక ప్రజలకు పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహార సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ ఫుడ్ కోర్టును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చిత్రావతి తీరాన్ని పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చేసేందుకు ఇది కీలక అడుగుగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, ఫుడ్ కోర్టు ఏర్పాటుతో సందర్శకులకు మెరుగైన సౌకర్యాలు అందడంతో పాటు స్థానిక యువతకు, వ్యాపారులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని చెపా-ఏరు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి. శ్రీనివాసులు, తహసీల్దార్ సంహిత, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు, పట్టణ ప్రముఖులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

అనంత సూర్య తెలుగువార్త

శనివారం 11 జూలై 2026

# పాపం పసిపాప.. ఇంజక్షన్ ఖరీదు రూ.17 కోట్లు

బతికించుకునేందుకు తల్లితండ్రుల జీవన పోరాటం
అందరూ చేయూతనిస్తే.. ఆరదు ఆ పసి దీపం




- బతికించుకునేందుకు తల్లితండ్రుల జీవన పోరాటం
- అందరూ చేయూతనిస్తే.. ఆరదు ఆ పసి దీపం



*అనంతపురం, జూలై 10 అనంత సూర్య :*

మాయ జబ్బు చిన్నారిపై పడింది. అందులోనూ లేని కుటుంబం ఆ చిన్నారి తల్లిదండ్రులది. పాపే దైవంగా.. ఆ పాపే జీవంగా జీవిస్తున్నారు ఆ దంపతులు. పాప బతకాలంటే ఆ ఇంజక్షన్ తప్పనిసరి. ఆ ఇంజక్షన్ ఖరీదు ఎంతో మీకు తెలుసా.. అక్షరాల రూ.17 కోట్లు. అందుకోసం ఆ తల్లి దతండ్రులు పడుతున్న తపన వేదన పోరాటం అనిర్వచనీయం అ వివరాలను ఒకసారి పరిశీలిస్తే.. ఇంకా ప్రపంచాన్ని సరిగా చూడని పసికందు.. తల్లిదండ్రుల ఒడిలో ఆడుకోవాల్సిన వయసులోనే ప్రాణాలతో పోరాడుతోంది. చిత్తూరు జిల్లా రెండు నెలల చిన్నారి జబ్బు అత్యంత అరుదైన ఎస్ మా-1 (స్పినల్ మస్క్యులర్ అట్రోఫీ టైప్-1) వ్యాధితో బాధపడుతోంది. ఈ ప్రాణాంతక వ్యాధికి చికిత్సగా ఒక్క ఇంజెక్షన్ మాత్రమే ఆశగా ఉండగా, దాని ధర రూ.17 కోట్లు కావడం కుటుంబాన్ని తీవ్ర ఆందోళనకు గురి చేసింది. ఎస్ మా-1 కారణంగా చిన్నారి కండరాలు క్రమంగా బలహీనపడుతూ శ్వాస తీసుకోవడం, కదలడం వంటి సాధారణ చర్యలే కష్టంగా మారుతున్నాయి. సమయానికి చికిత్స అందకపోతే ప్రాణాపాయం తప్పదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. చిన్నారి తల్లిదండ్రులు ఇప్పటికే తమ వద్ద ఉన్న ఆస్తులు, పొదుపు మొత్తాన్ని వైద్య చికిత్స కోసం ఖర్చు చేశారు. అయితే కోట్ల రూపాయల విలువైన ఇంజెక్షన్‌ను కొనుగోలు చేయడం వారి వల్ల సాధ్యం కాక, ఇప్పుడు ప్రజల సహాయం కోసం వేడుకుంటున్నారు. ప్రస్తుతం చిన్నారి ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ప్రతిరోజు ఆలస్యం.. ఆ చిన్నారి ఆరోగ్య పరిస్థితిని మరింత విషమం చేసే ప్రమాదం ఉందని వైద్యులు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో చిన్నారి ప్రాణాలను కాపాడేందుకు దాతలు, సేవా సంస్థలు, ప్రజా ప్రతినిధులు, సినీ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఒక చిన్న సహాయం.. ఒక చిన్నారి జీవితాన్ని కాపాడగలదు. మనమంతా కలిసొస్తే రూ.17 కోట్ల లక్ష్యం కూడా అసాధ్యం కాదు అంటున్నారు పలువురు ప్రముఖులు. చేయూతనిద్దాం తమవంతు సహాయంతో **'పాపం ఆ పసి పాప'**ను కాపాడుకుందామని పలువురు పిలుపునిస్తున్నారు.

# విద్యావ్యవస్థ నిద్రావస్థలో.. గురుకుల్.. కిల్ కిల్ !




*అనంతపురం, జులై 10 అనంత సూర్య :*

పిల్లి కళ్ళు మూసుకొని పాలు తాగుతూ నన్ను ఎవరూ చూడలేదులే అన్నది పాత భూత పదం. మోసంతో కూడిన తప్పు చేస్తున్నా, ఆ తప్పును చూస్తూ సహకరిస్తూ ప్రభుత్వ గురుకులాలకే మచ్చ తెచ్చేలా.. ఓ ప్రైవేట్ గురుకులం **'గురుకుల్ కిల్‌కిల్'**గా వ్యవహరిస్తున్న ఓ ఉదంతం ఇలా వెలుగులోకి వచ్చింది. ఇంత జరుగుతున్నా.. విద్యా వ్యవస్థ లోని జిల్లా అధికారులు నిద్రావస్థ నటించ డంపై పలు విద్యార్థి సంఘాలు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఉదాహరణకు అనంతపురం రూరల్ పరిధిలోని ఈ కథనం లో కనిపిస్తున్న ఆ గురుకుల పాఠశాలను క్షుణ్ణంగా పరిశీలించండి. కాసింత విచారణ చేసినా చాలు, అత్యంత విశ్వసనీయ వర్గాల ద్వారా అందిన సమాచారం మేరకు..

ఆ ప్రాంతంలో ఏడాదికోసారి బోర్డు మార్పు జరుగుతూ ఉందట. గత ఏడాది అక్కడ ఓ నర్సింగ్ కాలేజ్ ఉండేదని, ఇప్పుడు డాక్టర్ గోపికృష్ణ గురుకుల్ అంటూ, ఓ ఇంగ్లీష్ పాఠశాల. అందులోనే జూనియర్ కాలేజ్ కూడా నిర్వహిస్తున్నట్లు ఓ బోర్డు ఆ ప్రదేశంలో ప్రత్యక్షమవుతుంది. అత్యంత విశ్వసనీయ వర్గాల ద్వారా మాకు అందిన సమాచారం మేరకు అక్కడ 7వ తరగతి వరకు ఒక రకమైన అనుమతి తీసుకుని, నిర్వహణ మాత్రం టెన్త్, ప్లస్ టూ నిర్వహిస్తూ ఉండడం విశేషం. అయితే ఈ బాగోతం అంతా మన విద్యాశాఖ ఇంచార్జ్ అధికారికి తెలియదంటే పొరపాటే. ఆయనపై గతంలోనే పలు దినపత్రికలు 'బంగారు బాబు' అంటూ కూడా కథనాలు ప్రచురించాయి. అయినా ఇసుమంతైనా మార్పు రాకుండా, తప్పు చేసే పాఠశాలలపై చర్యలు తీసుకోకుండా.. 'నేనింతే' మారనన్నట్లుగా ఆయన వ్యవహార శైలి తయారై.. అనధికారిక పాఠశాలలను ప్రోత్సహిస్తున్నాడని బహిరంగ విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ చొరవ చూపి, అక్రమ పాఠశాలలను తక్షణం రద్దు చేసేలా కఠిన చర్యలు తీసుకొని బడుగు బలహీన వర్గాలకు సంబంధించిన విద్యార్థులను, వారి కుటుంబాలను అలాంటి వారి చెర నుండి కాపాడాలని పలువురు కోరుతున్నారు.

- అనంత రూరల్‌లో అనుమతుల్లేని ప్రైవేట్ గురుకులం
- ఆ ప్రాంతంలో ఏడాదికోసారి బోర్డు మార్పు
- ఉద్యమిస్తామంటున్న విద్యార్థి సంఘాలు
- 7 వరకు ఒకలా అనుమతి నిర్వహణ టెన్ ప్లస్ టూ
- ఓపెన్ మార్కెట్‌లాగా విద్యా వ్యాపారం
- మోసం చూస్తే.. ఏ అధికారికైనా దిమ్మ తిరిగి కళ్ళు తిరగాల్సిందే !

# అర్హులు ఓటు హక్కు కోల్పోవద్దు..



## సర్ ప్రక్రియను వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్

అనంతపురం, జూలై 10 అనంత సూర్య: ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (సర్--2026) ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ శుక్రవారం అనంతపురం నగరంలోని పలు పోలింగ్ కేంద్రాలు, సచివాలయాల్లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు, బీఎల్‌ఏలతో మాట్లాడిన ఆయన, జూలై 14తో సర్ ప్రక్రియ గడువు ముగియనున్నందున ప్రతి అర్హుడైన ఓటరును జాబితాలో చేర్చేలా సమన్వయంతో వేగంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. సొంత ఊరిలో లేని వారు, ఇటీవల నివాసం మార్చుకున్న కుటుంబాలు, ఓటరు జాబితాలో పేరు లేని అర్హులైన వారిని గుర్తించి ఆన్‌లైన్ ఎన్యూమరేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలు నిర్లక్ష్యం వీడి తమ ఓటు హక్కును కాపాడుకునేందుకు వెంటనే నమోదు ప్రక్రియలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతపురం నగరంలోని 45వ వార్డు పరిధిలోని 168, 169, 170, 171 పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటర్ల వివరాలను పరిశీలించిన కలెక్టర్, పెండింగ్ పనులను రెండు రోజుల్లోగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ జస్వంత్‌రావును ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్‌వోలు, అధికారులు సమన్వయంతో పనిచేసి సవరణ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌వోలు జోష్నా, కృష్ణవేణి, శ్రావణి, బీఎల్‌ఏ నాగభూషణం, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# బత్తలపల్లిలో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన ధర్మవరం అబ్జర్వర్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



బత్తలపల్లి, జూలై 10 అనంత సూర్య: ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ధర్మవరం నియోజకవర్గ అబ్జర్వర్, కూడా (కుడా) చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు శుక్రవారం బత్తలపల్లిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పార్టీ బీఎల్‌ఏలతో సమావేశమై ఎస్ఐఆర్ ప్రక్రియపై పలు సూచనలు చేశారు. ప్రభుత్వ బీఎల్‌వోలకు పూర్తిస్థాయిలో సహకరించాలని, ద్వంద్వ ఓట్లు, నకిలీ ఓట్లు, మరణించిన వారి పేర్ల తొలగింపులో ఎలాంటి అలసత్వం ప్రదర్శించవద్దని సూచించారు. మరో నాలుగు రోజుల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ ముగియనున్నందున అర్హులైన ఒక్క ఓటరికి కూడా అన్యాయం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన సూచించారు.

# ఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి 34,000 వేలు విరాళంగా ఇచ్చిన ఈ ఓ ఆర్ డి జి.వెంకట రాముడు



ముదిగుబ్బ,జూలై 10, అనంత సూర్య:ముదిగుబ్బ మండల పరిధిలో ఉన్న సానే వారి పల్లి ఆంజనేయ స్వామి దేవాలయ అభివృద్ధి కొరకు పులివెందుల నియోజకవర్గం లింగాల మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈ ఓ ఆర్ డి గా పని చేస్తున్న జి వెంకట రాముడు 34,000వేల రూపాయలు శుక్రవారం ఆలయ కమిటీ చైర్మన్ శ్రీరాములకు నగదు రూపంగా అందజేశారు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీరాములు మాట్లాడుతూ ఈ ఓ ఆర్ డి వెంకటరాముడు కుటుంబా సభ్యులకు ఆంజనేయస్వామి ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సిరి సంపదలతో వారి పిల్లలు ఉన్నత చదువులు చదివి మంచి ప్రభుత్వ ఉద్యోగాలు స్వీకరించాలని కలియుగ దైవమైన శ్రీ ఆంజనేయ స్వామి వారి కుటుంబమునకు ఆ స్వామి ఆశీస్సులు ఎల్లవేళలా తోడు ఉండాలని మనస్ఫూర్తిగా దేవాలయంలో ప్రత్యేక పూజలు చేయించినారు వారు ఆయురారోగ్యాలతో బాగుండాలని కోరుకుంటున్నాం అని తెలియజేశారు వారి కుటుంబం బాగా అభివృద్ధి చెందాలని పిల్లలు కూడా బాగా విద్యావంతులు కావాలని లక్ష్మీ సరస్వతి దేవి వెంట జంట ఉండి వారి కుటుంబాన్ని కాపాడాలని పదేపదే ప్రార్థిస్తున్నాం ఈ కార్యక్రమంలో సానే వారి పల్లి మాజీ సర్పంచ్ వెంకట రాముడు రంగయ్య స్వామివారి భక్తాదులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు అదేవిధంగా ఈ ఓ ఆర్ డి జి వెంకటరాముడుకు భక్తాదులు సానే వారి పల్లి గ్రామ ప్రజలు దేవాలయ అభివృద్ధికి విరాళం ఇచ్చిన దానివలన ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ అభినందనలు తెలియజేశారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405